క్లుప్తంగా

11న వేలంపాట

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా టెంకాయలను విక్రయించే హక్కుల వేలం ఈ నెల 11వ తేదీన దస్తగిరి స్వామి దర్గాలో నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, నరసిరెడ్డి, చిన్నాయప్ప బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు అదే రోజు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

ఆర్టీసీ డిపో తనిఖీ



జిల్లా ప్రజారవాణా అధికారికి బొకే ఇస్తున్న సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోను బుధవారం జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. డిపోలోని గ్యారేజీతో పాటు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సంస్థ అభివృద్ధికి కార్మికులు కృషి చేయాలని కోరారు. డిపో ఆదాయం తదితర అంశాలపై మేనేజర్ అమర్నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పీఎం సాహెబ్, యు.గోపాల్, బొట్టు ఈరన్న, ఎంఎండీ షరీఫ్ ఆయనకు పూలబొకే ఇచ్చి సత్కరించారు.

రూ.1.80 లక్షల విరాళం

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో నిర్మించనున్న చర్చి, మారెమ్మ దేవాలయానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు తోలు రాముడు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి బుధవారం రూ.1.80 లక్షల నగదును విరాళంగా అందజేశారు. తోలు రాముడు మారెమ్మ ఆలయానికి రూ.లక్ష, చర్చికి రూ.50 వేలు, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి రూ.30 వేలను ఆలయ కమిటీ పెద్దలకు అందజేశారు. కమిటీ పెద్దలు వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఈ–కేవైసీ 90 శాతం పూర్తి

మద్దికెర: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి 90 శాతం ఈ–కేవైసీ పూర్తయ్యిందని ఏఓ రవి బుధవారం తెలిపారు. రైతులు ఈనెల 15వ తేదీలోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తించవని వెల్లడించారు.

పోలింగ్ బూత్ పరిశీలన

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు, బెల్డోణ, నగరడోణ, రామదుర్గం తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ పద్మజ పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతుల కల్పన, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీటీ లక్ష్మినారాయణ, వీఆర్‌ఓలు మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

ఐదుగురికి జైలుశిక్ష

దేవనకొండ: తెర్నెకల్ గ్రామానికి చెందిన సూర్యనారాయణపై దాడి చేసిన కేసులో ఐదుగురికి ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.18 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పత్తికొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బుధవారం తీర్పు వెల్లడించారని దేవనకొండ పోలీసులు తెలిపారు. వివరాలు.. 8–10–2014న సూర్యనారాయణ తన ట్రాక్టర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్తుండగా ఉద్దేశపూర్వకంగా రాజు, చిన్నవెంకప్ప, తిమ్మప్ప, చిన్న హనుమంతు, రాజన్న దాడి చేసి కొట్టారన్నారు. బాధితుడు సూర్యనారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసు బుధవారం విచారణ పూర్తి కాగా పత్తికొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. వారిని జైలుకు తరలించారు.

పాతకక్షలతో హత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ పార్కు రోడ్డులో బుధవారం బోయ సోమేష్‌పై హత్యాయత్నం జరిగింది. వివరాలు.. స్థానిక వెంకటాపురం కాలనీవాసులైన బోయ సోమేష్, రామాంజనేయులు వర్గాలకు పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో బోయ సోమేష్ బుధవారం బైక్‌పై వెళ్తుండగా మరో వర్గానికి చెందిన కుక్కల సోమేష్ అడ్డగించడంతో వాగ్వాదం ఏర్పడింది. అక్కడేఉన్న బోయ రామాంజనేయులు, వెంకటేష్, అయ్యన్న, కొండయ్య, గోవిందులు ఆగ్రహంతో బోయ సోమేష్‌పై కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఇదే గొడవలో కుక్కల సోమేష్‌కు చేతికి తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వారు రావడంతో దాడి చేసినవారు పరారయ్యారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు బోయ సోమేష్ భార్య కేశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నందవరం: హాలహర్వి గ్రామం జగనన్న కాలనీలో స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించాలని లబ్ధిదారులు ఉరుకుందమ్మ, శివనాగమ్మ కోరారు. ఈ మేరకు బుధవారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ దాసరి ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఆక్రమదారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



పల్లెదొడ్డిలో సురక్ష శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్



పల్లెదొడ్డిలో గ్రామస్తుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

‘పల్లె’వించిన వైద్య సేవలు

- ప్రతి సచివాలయం పరిధిలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్
- అందుబాటులో టెలీమెడిసిన్ సేవలు
- వరంలా మారిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర చికిత్సలపై ప్రత్యేక శిక్షణ
- ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు



పాలకుర్తిలో ఏర్పాటైన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



దేవనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు వరంలా మారాయి. ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తినా అక్కడికి వెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవడంతో పాటు తగిన వైద్యం పొందుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులతో బాధపడే వారు తరచూ పరీక్షలు చేయించుకునేందుకు అనుకూలంగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, పిల్లలకు వేసే టీకాలకు వెల్‌నెస్ కేంద్రాలు వేదికలుగా మారాయి. వెల్నెస్ కేంద్రాల్లో సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో అక్కడ పనిచేసే మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు తమ వద్దకు వచ్చే వారికి అవసరమైన సేవలు అందిస్తున్నారు.

ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య కేంద్రం

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేవనకొండ మండలంలో మొత్తం 22 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వాటిలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌తో పాటు ఏఎన్ఎం, ఆశా వర్కర్, హెల్త్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు అందుతాయి. 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారు. 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. దీంతో అనారోగ్యానికి గురైన వారిని పరీక్షించి అవసరమైతే టెలీ మెడిసిన్ విధానం ద్వారా వైద్యుడితో మాట్లాడిస్తున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆస్పత్రి, బోధనాస్పత్రులకు వెళ్లాలని సిఫార్సు చేస్తున్నారు. హెల్త్ క్లినిక్‌లు మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధుల వారికి సంజీవనిలా మారాయి.

వరంలా జగన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు గ్రామీణులకు వరంలా మారాయి. ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో వారంలో రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులు, స్పెషలిస్టు వైద్యులతో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో అనారోగ్యంతో మంచంపై ఉన్న వారి ఇంటికే వెళ్లి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

సేవలు ఇలా..

- రోజూ క్లినిక్‌లకు వచ్చే రోగులను పరీక్షించి మందులు ఇస్తారు.
- జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువ చేస్తారు.
- గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.
- హెల్త్ క్లినిక్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శిస్తూ అనారోగ్యం, రక్తహీనత, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వైద్యం అందేలా చూస్తారు.
- మంచినీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ క్లోరినేషన్ వంటి వాటిని పరిశీలిస్తారు.
- పారిశుధ్యం, దోమల నివారణ వంటి కార్యక్రమాలతో పాటు డ్రైడే–ఫ్రైడే నిర్వహణకు కృషి చేస్తారు.
- ప్రతి బుధ, శనివారం ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తారు.
- ఇక్కడి ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర వైద్యం, బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎవరైనా పాముకాటుతో వస్తే ఏమి చేయాలి, పాయిజన్ కేసులు వస్తే ఎలా వ్యవహరించాలి, గుండె ఆగినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

అన్ని సేవలు అందుతున్నాయి



మా ఊళ్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. ఇక్కడే టీకాలు వేస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేస్తున్నారు. 15 రోజులకోసారి డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. గతంలో వైద్యం పొందాలంటే కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంతేకాదు పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షలు చేయడంతో మాకు ఎంతో మేలు కలుగుతోంది.

– భూలక్ష్మి, పల్లెదొడ్డి గ్రామం

ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుంటున్నా



గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రతి రెండు వారాలకోసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుంటున్నా. గతంలో నేను కర్నూలుకు వెళ్లి చికిత్స చేయించుకునేవాడిని. అప్పుడు నాకు రూ.2 వేల దాకా ఖర్చయ్యేది. గ్రామంలోనే హెల్త్ క్లినిక్‌లు ఉండడంతో ఖర్చులు, వ్యయ ప్రయాసాలు లేవు. వైద్యసేవలు బాగా అందిస్తున్నారు.

– ఈరన్న, పల్లెదొడ్డి గ్రామం

ప్రతిష్టాత్మకంగా వైద్యసేవలు



దేవనకొండ మండలంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్యసేవలను ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నాం. అత్యవసర ప్రాథమిక చికిత్సలపై ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ కూడా అందించాం. పాముకాటు, పాయిజన్ కేసులకు ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించాం. కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్)పై శిక్షణ ఇచ్చాం. గ్రామీణులకు మెరుగైన సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పక్కాగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, దేవనకొండ పీహెచ్‌సీ

సీఎంను కలిసిన ఎమ్మెల్యే శ్రీదేవి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం వెలగపూడి అసెంబ్లీ సీఎం కార్యాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కలిశారు. నియోజవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు. వెనకబడిన తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేలా చూడాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అంతకుముందు అసెంబ్లీలో తుగ్గలి మండలంలోని కరువు పరిస్థితులు, రైతుల స్థితిగతులపై ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులను ఆదుకోవాలని సభ దృష్టికి తీసుకొచ్చారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలం కచ్చాపురం వద్ద అక్రమంగా కలిగి ఉన్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం కచ్చాపురం – నారాయణపురం గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేస్తుండగా కోసిగి మండలం చిన్నభూంపల్లి గ్రామానికి నాగులదిన్నె రాముడు వద్ద 96 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) లభించినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.4,500 ఉంటుందన్నారు. మద్యంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



కృష్ణగిరి తహసీల్దార్ అనురాధ

కృష్ణగిరి: మండల తహసీల్దార్‌గా అనురాధ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్ డి–సెక్షన్‌కు బదిలీగా ఆమె స్థానంలో వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండల తహసీల్దార్‌గా ఉన్న అనురాధ ఇక్కడకు వచ్చారు. అలాగే పత్తికొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న విష్ణుప్రసాద్ మండల డీటీగా బాధ్యతలు చేపట్టారు. వీరికి మండల సర్వే డీటీ రామలక్ష్మి, ఏఎస్ఓ జానకీబాయి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మనోహర్‌రావు, రామాంజినేయులు, వీఆర్వోలు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఉత్తమ సేవకు సత్కారం

హొళగుంద: ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన ఏఈఓ విరూపాక్షికి బుధవారం ఆలూరులో జేడీ వరలక్ష్మి, ఆలూరు ఏడీఏ సునీత చేతులమీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఏఓ ఆనంద్‌లోకదల్, వీఏఏలు, వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందించారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం



హాలహర్విలో సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఆలూరు ఇన్‌చార్జి విరూపాక్షి తదితరులు

హాలహర్వి: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జేసీఎస్ కన్వీనర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి, ఆలూరు ఇన్‌చార్జ్ విరూపాక్షి పిలుపునిచ్చారు. బుధవారం హాలహర్విలో మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 11న అనంతపురం జిల్లాలో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో జరిగే ‘సిద్ధం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దుష్ట చతుష్టయంతో యుద్ధానికి పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించి ప్రజల మద్దతు కోరాలన్నారు. ఆలూరు నియోజకవర్గంలో కార్యకర్తల సమస్యలన్నీ తెలుసుకున్నానని అండగా ఉంటానని విరూపాక్షి భరోసా ఇచ్చారు. అంతకముందు వారిని పార్టీ కార్యకర్తలు, నాయకులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్సీపీ మండల నాయకులు పచ్చారపల్లి రామిరెడ్డి, జనార్ధన్‌నాయుడు, మల్లికార్జున, రంజిత్, గంగాధర, గోపాల్, రాఘవేంద్రరెడ్డి బజారప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

హొళగుంద: జగనన్న పాలనలో మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటే రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని నాయకులు బీవై రామయ్య, విరూపాక్షి ప్రజలను విజ్ఞప్తి చేశారు. వారు బుధవారం తెర్నెకల్ సురేంద్రరెడ్డితో కలిసి హొళగుందలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి, సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, ఆలూరులో జింకల పార్కు ఇలా 600 హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని హేళన చేసిన చంద్రబాబు నేడు ఎన్నికలు సమీపిస్తుండడంతో అవే పథకాలకు పేరు మార్చి ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు మల్లికార్జున, ఈశా, కోగిలతోట శేషప్ప, హనుమప్ప, మల్లికార్జున, కెంచప్ప, పంపాపతి, దొడ్డబసప్ప, ఎస్కే గిరి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండల కేంద్రం నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెరకు రూ.10 కోట్లతో 12 కి.మీ మేర చేపట్టే బీటీ రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరుపాక్షి బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నంచర్ల, దౌల్తాపురం గ్రామాల ప్రజలు చిప్పగిరికి రావాలంటే గుంతకల్లు మీదుగా 40 కి.మీ ప్రయాణించాల్సి వచ్చేదని, ఈ రోడ్డు నిర్మాణంతో కేవలం 8 కి.మీ ప్రయాణంతో చేరుకోవచ్చని తెలిపారు. అలాగే రెవెన్యూ డివిజన్ పత్తికొండకు వెళ్లేందుకు సులభతరం అవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మారయ్య, సర్పంచులు గోవిందరాజులు, భీమ, వైస్ సర్పంచులు పెదపెద్దయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ్ శర్మ


ఎమ్మిగనూరురూరల్: స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న నిత్యావసర సరుకులు, తుకాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోడౌన్ నుంచి ప్రజలకు అందించే నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. లారీలకు సంచులను ఎత్తేటప్పుడు తుకాలను చూసుకోవాలన్నారు. బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ లక్ష్మణ్ణ, గోడౌన్ సిబ్బంది ఉన్నారు.

రాళ్లదొడ్డిలో భూముల పరిశీలన

మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ పరిశీలించారు. భూరికార్డులు, హద్దులను క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారి భూములను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. భూ రికార్డులు, సర్వే పక్కాగా ఉండాలని ఆదేశించారు. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూమి హద్దులు చూపించి హద్దు రాళ్లను పాతించాలన్నారు. తహశీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ లక్ష్మణ్, వీఆర్వోలు షేక్షావలి, సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.

గోనెగండ్ల: మండలంలోని వేముగోడు గ్రామంలో సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకొనేందుకు మార్కెట్ విలువ 5 శాతం చెల్లించాలన్నారు. తహసీల్దార్ డి.పార్వతి, ఆర్ఐ సుబ్బారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే బీవీకి పుట్టగతులుండవ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమల రెడ్డి, తోలు రాముడు

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామాభివృద్ధిని అడ్డుకుంటే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బీవీ జయనాగేశ్వర రెడ్డికి పుట్టగతులుండవని సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోలు రాముడు, మహేష్‌రెడ్డి, ప్రహ్లాద తదితరులు హెచ్చరించారు. బుధవారం గోనెగండ్ల సహకారం సంఘం ఆవరణలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రూ.3 కోట్లు కేటాయించడంతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్, పాఠశాల నిర్మాణం, అలాగే అయ్యకొండ గ్రామం నుంచి గంజిహళ్లి మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు తదితర పనులు చేపట్టాల్సిఉందన్నారు. ఈ పనులు జరగకుండా మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఆయన అనుచరులు అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 6,500 మంది జనాభా ఉన్న గ్రామానికి 20 సెంట్ల శ్మశాన వాటిక ఉందని, ప్రస్తుతం ఎకరన్నర భూమిలో శ్మశానం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే దాన్ని కూడా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీలైతే గ్రామాభివృద్ధికి పాటుపడాలి తప్ప ఆటంకం కలిగించరాదని కోరారు.

నులి పురుగులను నివారిద్దాం

తుగ్గలి: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పురస్కరించుకొని ఈనెల 9న ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎమ్మార్సీలో పోస్టర్లను విడుదల చేశారు. అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పిల్లలకు ఈ మాత్రలు అందించాలన్నారు. వైద్యాధికారులు ఆయా పాఠశాలలకు మాత్రలు సరఫరా చేస్తారన్నారు. కార్యక్రమంలో తుగ్గలి, పగిడిరాయి పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, హరిత, ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు



తంగరడోణలో వెలసిన చింతలముని స్వామి



నల్లారెడ్డి స్వామి

ఆస్పరి: తంగరడోణ గ్రామంలో వెలసిన చింతల ముని, నల్లారెడ్డి స్వాముల 34వ ఆరాధనోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పార్వతి బుధవారం తెలిపారు. ఆలయాల్లో మూడు రోజులు పాటు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణాధారణ, కలశ స్థాపన, అభిషేకాలు, గణపతి, సుదర్శన హోమం, మహా మంగళహారతి, ప్రాతఃకాల పూజ, పంచామృతాభిషేకం, రుద్ర, నవగ్రహ హోమం, కూష్మాండ బలి, పూర్ణాహుతి, గణపతి హోమం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరాధనోత్సవాలకు మండలంలోని ఆస్పరి, తురువగల్లు, తొగలగల్, డొడగొండ, యాటకల్, బైలుపత్తికొండ, గార్లపెంట, యాటకల్ గ్రామాల నుంచి కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చైర్మన్ చెప్పారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి



పెండేకల్లులో సీసీ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయని సింగిల్‌విండో అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, సర్పంచ్ లీలావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షలతో పెండేకల్లులో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందని చెప్పారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సచివాలయ కన్వీనర్ బసిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పెద్ద రంగన్న, విజయలక్ష్మి పాల్గొన్నారు.